సాక్షి మంచిర్యాల

గురువారం । 4 । జూలై । 2024



గనుల వేలంపై నిరసనల వెల్లువ

బొగ్గు గనుల వేలంపై టీబీజీకేఎస్, సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8లో▸



ఘనంగా వన మహోత్సవం

జిల్లాలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఊరూరా మొక్కలు నాటారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని పేర్కొన్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల నైపుణ్యం కోసం డికోడబుల్ టెక్ట్స్



బుక్స్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పఠన నైపుణ్యాలు పెంపొందించడం కోసం డికోడబుల్ టెక్ట్స్ ఉపయోగపడుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన డికోడబుల్ టెక్ట్స్(విసంకేతి పాఠ్య పుస్తకాలు) వికాసం 1, 2 పుస్తకాలను డీఈవో యాదయ్య, ఎంఈవో సత్యనారాయణ మూర్తి, రూం టు రీడ్ ఇండియా సంస్థ రాష్ట్ర మేనేజర్ నరసింహాచారిలతో కలిసి ఆవిష్కరించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీసీపీ

చెన్నూర్: సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదుదారునితో మర్యాదగా ప్రవర్తించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. బుధవారం చెన్నూర్ పోలీసుస్టేషన్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ 100 డయల్ కాల్‌కు వెంటనే స్పందించాలని తెలిపారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారునికి రసీదులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సైలు శ్వేత, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్‌ను హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా బుధవారం డీసీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి బెటాలియన్‌ను సందర్శించాలని కోరారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

మంచిర్యాలఅర్బన్: నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న తలపెట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు సహకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అభిరామ్, వైజేఎస్ జిల్లా అధ్యక్షుడు సిరాజ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి మనోహర్, ఏఐవైఎఫ్ జిల్లా బాధ్యులు మొగిలి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు.

ఎంజేపీ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎంజేపీ డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ శ్రీధర్ తెలిపారు. పురుష అభ్యర్థులు ఈ నెల 8వరకు గుడిపేట్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీఎస్)-38, బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్)-39, బీఎస్సీ (ఎంఎస్ డీఎస్)-38, బీఎస్సీ(బీజెడ్‌జీ)-40, బీకాం(సీఏ)-32, బీకాం(బీఏ)-40, బీఏ(ఎస్‌పీఏ)-39 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరం తరగతులు నిర్మల్‌లోని ఎంజేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్



భవన నిర్మాణ రంగంలోని బాల కార్మికులకు ఆపరేషన్ ముస్కాన్ ద్వారా విముక్తి(ఫైల్)



ఆపరేషన్ ముస్కాన్ వాల్‌పోస్టర్

- బాల కార్మికులకు భరోసా
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రణాళిక
- పోలీసు, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్
- ఈ నెల 31వరకు కార్యక్రమాలు

మంచిర్యాలక్రైం: బాల కార్మికులు, తప్పిపోయిన వారు, అనాథ చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం మళ్లీ మొదలైంది. జిల్లాలో ఈ నెల ఒకటిన ప్రారంభం కాగా 31వరకు నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. బాల కార్మికులను గుర్తించే పనిలో రెస్క్యూ బృందాలు నిమగ్నమయ్యాయి. ఇటుకబట్టీలు, మెకానిక్ షెడ్లుల్లో బాలబాలికలు వెట్టిలో మగ్గిపోతుండగా, తప్పిపోయిన వారు, అనాథలు బస్టాండ్లు, ఇతర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం 2015లో పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 2017 నుంచి 2023వరకు 2,134 మంది బాలబాలికలను చెర నుంచి విడిపించి కౌన్సెలింగ్ నిర్వహించి కొందరిని బడిలో చేర్పించారు. మరి కొందరిని తల్లిదండ్రులకు అప్పగించారు. అనాథ పిల్లల సంరక్షణకు చర్యలు చేపట్టారు. ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీసు, సంబంధిత శాఖల అధికారులు రెస్క్యూ బృందాలుగా ఏర్పడి బాలకార్మికులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. బస్టాండ్లు, ఇటుకబట్టీలు, మెకానిక్‌షెడ్లు, మిల్లులు, భిక్షాటన చేసేవారిని, తప్పిపోయిన వారిని, వీధి బాలలను గుర్తిస్తున్నారు. బాలకార్మికులుగా గుర్తించిన వారిని తల్లిదండ్రులతో మాట్లాడి అప్పగించడం, హాస్టళ్లలో చేర్పించడం చేస్తారు. తల్లిదండ్రులు లేని వారుంటే బాలసదన్, స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు.

ఒకటి నుంచి 8వరకు..

ఈ నెల ఒకటి నుంచి ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం కాగా ఈ నెల 8వరకు స్టేట్‌హోం, చైల్డ్‌హోంలలో పిల్లలను చేర్పించేందుకు అనువైన వాతావరణం ఉందా..? లేదా..? వీటికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? అనాథలు, తప్పిపోయిన వారు ఉన్నారా..? అనేది పరిశీలించడం, రెండో వారం నుంచి వీధి బాలలు, చైల్డ్ లేబర్, అనాథలను గుర్తించడం, తప్పిపోయిన వారిని రెస్క్యూ చేయడం జరుగుతుంది. బాలకార్మికులను గుర్తించడంతోపాటు వారి ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తారు.

తప్పిపోయిన పిల్లల గుర్తింపు

వివిధ కారణాలతో కుటుంబం నుంచి విడిపోయిన, తప్పిపోయిన పిల్లలను గుర్తించడానికి దర్పన్ అనే ఫేషియల్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ఈసారి ఉపయోగించనున్నారు. ఎక్కడైన తప్పిపోయిన వారి ఫొటోలను దర్పన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇదివరకే వారి ఫొటోలు అప్‌లోడ్ అయి ఉంటే వెంటనే పూర్తి వివరాలు తెలుస్తాయి. ఒక్కసారి అప్‌లోడ్ చేస్తే అది యాప్‌లో ఉండిపోతుంది. రెస్క్యూ టీంలు హోటళ్లు, కర్మాగారాల్లో, మెకానిక్ షెడ్లలో పని చేస్తూ.. ఎవరు లేని వారి ఫొటోలను దర్పన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి వెట్టి నుంచి విడిపించి సంరక్షణ కల్పిస్తారు.

జిల్లాలో మూడు బృందాలు

రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు జిల్లాలో మూడు రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో కార్మికశాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, వైద్యశాఖ, విద్యాశాఖల నుంచి ఒక్కరు, నలుగురు కానిస్టేబుళ్లు, ఒక ఎస్సై ఉంటారు. ఈ బృందాలకు ఎస్సై నేతృత్వం వహిస్తారు.

ఇన్‌చార్జీలు వీరే...

డివిజన్	అధికారి పేరు	హోదా	సెల్ నంబర్
మంచిర్యాల	వై.రామయ్య	ఎస్సై	9848815120
జైపూర్	నాగరాజు	ఎస్సై	9441122702
బెల్లంపల్లి	అబ్దుల్ సత్తర్	ఎస్సై	9490435081

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు..



బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలు కఠినంగా ఉన్నాయి. హోటళ్లు, కిరాణ దుకాణాలు, ఇటుకబట్టీల్లో, కర్మాగారాల్లో బాలబాలికలను పనిలో పెట్టుకున్న వారి సమాచారం అందించాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి. కొందరు కుటుంబ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పిల్లలను బడికి పంపించకుండా పనిలో పెడుతున్నారు. ఇది కూడా నేరమే. బాల కార్మికుల సమాచారం 100డయల్, 1098 నంబర్లకు అందించాలి.

– రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు

ఉద్యోగులకు తీపికబురు

- సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు అందింది. ప్రభుత్వ శాఖల్లో అధికారుల సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులతోపాటు గత కొంతకాలంగా వేరే చోటుకు వెళ్లాలనుకునే అధికారులకు బదిలీలతో మార్గం సుగమమైంది. ఇప్పటికే విద్యాశాఖ పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతుండగా ఇక సాధారణ బదిలీలకు సర్కారు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 5 నుంచి 20లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంటే పదిహేను రోజుల్లో సంబంధిత అధికారులను బదిలీ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు మినహా సాధారణ ప్రభుత్వ శాఖల్లో పని చేసే మిగతా అధికారులకు ఈ బదిలీలు జరగనున్నాయి. రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, స్టాంప్స్అండ్ రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, అటవీ, పోలీసు తదితర శాఖల ఉద్యోగులకు ఈ సాధారణ బదిలీల్లో మినహాయింపు ఉంటుంది. బదిలీల ప్రక్రియ కోసం ఈ నెల 5నుంచి 8వరకు ఉద్యోగ సంఘాలను సంప్రదించడం, ఆయా శాఖల్లో ఉన్న ఖాళీల ప్రకారం జాబితా ప్రచురిస్తారు. తర్వాత 9నుంచి 12వరకు ఉద్యోగులకు ఆయా చోట్లకు వెళ్లేందుకు ఆప్షన్లు ఎంచుకునేందుకు అవకాశం కల్పిస్తారు. 13నుంచి 18వరకు పరిశీలన చేసి, మెరిట్ జాబితా రూపొందిస్తారు. 19నుంచి 20వరకు బదిలీల ఉత్తర్వులు జారీ చేస్తారు. అలాగే బదిలీ ఉత్తర్వు వెలువడిన మూడు రోజుల్లో ఆ ప్రాంతం నుంచి రిలీవ్ అయి వేరే చోట జాయినింగ్ కావాల్సి ఉంటుందని నిబంధన విధించారు. బదిలీ ప్రక్రియ కోసం ఆప్షన్ ఎంపికకు దరఖాస్తు రూపొందించింది. ఇందులో ఉద్యోగ వివరాలతోపాటు బదిలీ కోరేందుకు ఐదు ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు.

కమిటీల ఆధ్వర్యంలో ప్రక్రియ

రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలో బదిలీల కోసం కమిటీలు ఏర్పాటు చేసి ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ప్రతీ స్థాయిలో ముగ్గురు సభ్యులతో బదిలీల కమిటీ ఏర్పడనుంది. రాష్ట్ర పరిధిలో స్పెషల్ సెక్రెటరీ, ఆ శాఖ విభాగాధిపతి(కన్వీనర్), అడిషనల్ సెక్రెటరీ స్థాయి అధికారి(సెక్రెటరీ నామినేట్ చేస్తారు), జోనల్ స్థాయిలో ప్రాంతీయ ఆ శాఖాధిపతి, అడిషనల్ సెక్రెటరీ స్థాయి అధికారి(నామినేట్), కన్వీనర్‌గా ప్రాంతీయ అధికారి ఉంటారు. ఇక జిల్లా పరిధిలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సంబంధిత శాఖాధిపతి కన్వీనర్‌గా ఈ కమిటీ ఏర్పడనుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం జూన్ 30లోపు ఒకే చోట రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకోకుండా ఏ ఉద్యోగిని బదిలీ చేయరాదు. అలాగే ఒకే స్టేషన్ పరిధిలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్నవారు సైతం అక్కడే కొనసాగరాదు. సర్వీస్‌లో 40శాతం ఒకే చోట ఉన్నవారు వంటి నిబంధనలు ఇచ్చారు. అయితే స్పౌజ్ కోటా, వచ్చే ఏడాది జూన్ 30వరకు రిటైర్మెంట్ ఉన్నవారికి మినహాయింపు ఉంటాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, తదితర వారికి మినహాయింపులు ఇచ్చారు.

ప్రత్యేక అధికారుల నియామకం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల, జిల్లా ప్రజాపరిషత్‌ల కార్యవర్గాల ఐదేళ్ల పదవీ కాలం ముగుస్తోంది. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగియగా బుధవారంతో మండల, గురువారంతో జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం పూర్తవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం బయటకు రావడం లేదు. దీంతో మండల ప్రజాపరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



మంచిర్యాల జిల్లా పరిషత్ కార్యాలయం

జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కుమార్‌దీపక్ వ్యవహరిస్తారు.

మండలం	ప్రత్యేకాధికారి
హాజీపూర్	ఎస్.యాదయ్య, డీఈఓ
బెల్లంపల్లి	సీహెచ్.దుర్గాప్రసాద్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్
భీమారం	కే.చిన్నయ్య, జిల్లా సంక్షేమాధికారి
చెన్నూర్	డి.వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి
దండేపల్లి	పి.రవీందర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి
జైపూర్	గణపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి
జన్నారం	ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి
కన్నెపల్లి	ఎం.హరనాథ్, జనరల్ మేనేజర్, డీఐసీ
కాసిపేట	ఎం.గంగారం, డీటీడీఓ
కోటపల్లి	బి.వినోద్‌కుమార్, డీబీసీడీఓ
లక్సెట్టిపేట	ఈ.శంకర్, జిల్లా పశువైద్యాధికారి
మందమర్రి	మహ్మద్ ఖాసీం, చీఫ్ ప్లానింగ్ అధికారి
నెన్నెల	శ్రీనివాస్, ఏడీ, భూమి, కొలతల విభాగం
తాండూర్	వై.గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి
వేమనపల్లి	వి.ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి

ఊరటనిచ్చిన వాన



నెన్నెలలో విత్తనం మొలకెత్తని చోట మళ్లీ విత్తనం నాటుతున్న కూలీలు

- వడలిపోతున్న సమయంలో పత్తి మొలకకు ఊపిరి
- మొలకెత్తని చోట్ల మళ్లీ విత్తుకుంటున్న రైతులు
- జిల్లాలో 30.3మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: గత కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురిసిన వర్షం ఊరటనిచ్చింది. జిల్లా వ్యాప్తంగా 30.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నస్పూర్, మంచిర్యాల, కాసిపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. బోసిపోయిన వాగులు, ఒర్రెల్లో వరద నీటితో జలకళ సంతరించుకుంది. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరింది. గత నెల 22 నుంచి 27 వరకు కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలు వేసుకున్నారు. వరి నారు పోసుకున్నారు. వారం నుంచి ఉదయం ఎండలు, సాయంత్రం మబ్బులు కమ్ముకుని అక్కడక్కడ చిరుజల్లులకే పరిమితమైంది. ఎండలతో పత్తి విత్తనాలు మొలకెత్తక, మొలక వచ్చి వడలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. విత్తనం 85నుంచి 95శాతం మొలక రావాల్సి ఉండగా వర్షాల్లేక, నేలలో పదును కరువై 50 నుంచి 60 శాతమే మొలక వచ్చింది. ప్రస్తుతం కురిసిన వర్షం మొలకకు ఊపిరి పోసినట్లయింది. మరోవైపు ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన సాధారణ ప్రజానీకానికి చల్లబడ్డ వాతావరణంతో ఉపశమనం లభించింది. దుక్కులు రాక పాడిబారిన చేన్లు, లోతట్టు భూముల్లో ప్రస్తుతం కురిసిన వర్షంతో నీరు నిలిచింది. ఇప్పటికే పత్తి విత్తుకున్న రైతులు మొలకెత్తని చోట మళ్లీ విత్తనాలు వేస్తున్నారు. జిల్లాలో గత నెలలో సాధారణ వర్షపాతానికి లోటు ఉండగా.. బుధవారం వరకు కురిసిన వర్షంతో సాధారణ వర్షపాతానికి చేరువైంది. ఇందులో అధికంగా కాసిపేట, బెల్లంపల్లి, నస్పూర్ మండలాల్లో 20 నుంచి 45 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం, 9 మండలాల్లో 20 నుంచి 57శాతం లోటు వర్షపాతం నెలకొంది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటివరకు 188.4 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 162.7 మిల్లీమీటర్లు కురిసింది. ఇంకా 14 శాతం లోటుగా నెలకొంది. మరో రెండు రోజులు జిల్లాకు భారీ వర్ష సూచన ఉండడంతో ఇప్పటివరకు దుక్కులు దున్ని విత్తనాలు వేయని రైతులు విత్తకుంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

మండలం	మిల్లీమీటర్లు
నస్పూర్	63.2
కాసిపేట	53.7
మంచిర్యాల	47.1
హాజీపూర్	39.1
నెన్నెల	33.6
జైపూర్	32.1
చెన్నూర్	31.4
బెల్లంపల్లి	31.2
భీమారం	28.3
వేమనపల్లి	28.2
కోటపల్లి	27.6
దండేపల్లి	21.8
కన్నెపల్లి	14.2
జన్నారం	14.0
తాండూర్	7.3
భీమిని	4.4

అభివృద్ధి పనుల్లో సిండికేట్..?

- మంచిర్యాల బల్దియాలో 36 వార్డుల పనులకు డ్రా
- కాంట్రాక్టర్లకు ఒక్కోవార్డు అప్పగింత
- పోటీ లేకుండానే పనులు అప్పగించే ప్రయత్నం



డ్రా తీస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీలో అభివృద్ధి పనులను చైర్మన్, వైస్‌చైర్మన్, కొందరు కౌన్సిలర్లు కాంట్రాక్టర్లతో సిండికేట్‌గా ఏర్పడి డ్రా పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించడం చర్చనీయాంశమైంది. బుధవారం మున్సిపల్ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్ ఆధ్వర్యంలో కొందరు కౌన్సిలర్లు కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఒక్కో వార్డుకు రూ.5 లక్షల చొప్పున రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కేటాయించి టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల 5న సాయంత్రం వరకు ఆన్‌లైన్ టెండర్లకు అవకాశం ఉండగా, ముందస్తుగానే డ్రా పద్ధతిలో పనులు పంచుకోవడం గమనార్హం. గతంలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేవారు. కొత్తగా పాలకవర్గం, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి టెండర్లకు పోటీ లేకుండా ఒక్కో కాంట్రాక్టర్‌కు ఒక్కో వార్డు పనులు అప్పగించేలా డ్రా తీశారు. ఒక బాక్సులో వార్డు నంబర్ల చీటీలు, మరో బాక్సులో కాంట్రాక్టర్ల పేర్లతో కలిగిన చీటీలను వేసి ఒక్కో బాక్సు నుంచి ఒక్కో చీటి తీసి ప్రకటించారు. డ్రాలో వచ్చిన వారు వార్డులో పనులకు టెండర్లు వేయాలని నిర్ణయించారు. పనులు లభించని కాంట్రాక్టర్లు కొందరు పాలకవర్గంతో వాగ్వాదానికి దిగారు. లోకల్, నాన్ లోకల్ కాంట్రాక్టర్లుగా పేర్కొంటూ కొందరిని మాత్రమే డ్రాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించడంపైనా కొందరు కాంట్రాక్టర్లు పాలకవర్గంతో వాగ్వాదానికి దిగి సమావేశం నుంచి బయటకు వెళ్లారు.

పనుల్లో నాణ్యత కోసమే

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించిన ప్రతీసారి కాంట్రాక్టర్లు పోటీ పడి 20శాతం వరకు తక్కువ ధరకు వేస్తున్నారు. పనులు నాణ్యతతో చేపట్టడం లేదు. పనుల్లో నాణ్యత ఉండాలన్నా, పనులను 30 రోజుల్లోపు పూర్తి చేయాలన్నా టెండర్లకు పోటీ ఉండవద్దనే డ్రా పద్ధతిలో కాంట్రాక్టర్లకు ఒక్కో వార్డును కేటాయించేందుకు డ్రా తీశాము. దీని వల్ల టెండర్లు వేసుకునే వారికి పోటీ ఉండకుండా, వారితో నాణ్యతతో కూడిన పనులు చేయించాలన్నదే మా ఉద్దేశ్యం.

– రావుల ఉప్పలయ్య, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



పాఠం బోధిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమిని: ప్రభుత్వ పాఠశాలల స్థలాలు కబ్జా చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. బుధవారం భీమిని మండలం పెద్దపేట, వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. పాఠశాల స్థలం కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారని ఆయన దృష్టికి రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కబ్జా చేసిన వారే ఫెన్సింగ్ తొలగించి స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కేజీబీవీని సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దార్ భిక్షర్ణదాస్, ఎంపీడీఓ గంగామోహన్, ప్రత్యేక అధికారి కల్పన పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్

భీమిని కేజీబీవీలో కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు వన మహోత్సవానికి హాజరైన కలెక్టర్ అక్కడికి చేరుకున్న కేజీబీవీ విద్యార్థినులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం కేజీబీవీకి వెళ్లి సుమారు 20 నిమిషాల పాటు గణితం బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడుగగా.. ధైర్యంగా సమాధానాలు చెప్పడంతో అభినందించారు. తన పాఠశాల అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి ప్రభుత్వ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కోర్టు దావాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల పరిధిలో కోర్టుల్లో పెండింగ్ ఉన్న దావాల విషయంలో చర్యలు వేగవంతం చేయాలని, త్వరగా పరిష్కారానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రిపోర్టు సమర్పించే సమయంలో ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా సమగ్ర విచారణ జరిపి వాస్తవ నివేదికను అందించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బుధవారంతో ఎంపీపీల పదవీ కాలం పూర్తయినందున జిల్లాలో 16 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, మండలాలను సందర్శించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై వారాంతపు నివేదిక సమర్పించాలని తెలిపారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల అధికారులు ఒక డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని అన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

జైనూర్: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంలొద్ది గ్రామానికి చెందిన శేక్ ఆరిఫ్(32) మూడేళ్లుగా మతిస్థిమితం కోల్పోయాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని నవేగాం బస్తీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్ బుధవారం ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతుండగా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. అఫ్రోజ్ నుంచి 18 వేల రూపాయల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


సంగీతరావు(ఫైల్)

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ చీమల సంగీతరావు (68) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. రేపల్లెవాడ చర్చి సమీపంలో నివాసం ఉండే సంగీతరావు మంగళవారం రాత్రి తన బైక్‌పై తాండూర్ ఐబీకి వచ్చి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంగీతరావు మృతి తీరని లోటు...

సంగీతరావు మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడాల రాజేశం, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, సూరిబాబు, షేక్ అహ్మద్, శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు.

కౌలురైతు ఆత్మహత్య

పెంచికల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో కౌలురైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని యాపలగూడకు చెందిన అర్క సంతోష్ (28) తన కున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని అందులో పత్తి విత్తనాలు విత్తాడు. వర్షాలు కురియక విత్తనాలు మొలకెత్తక పోవడంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం కడెం వాగు ఒడ్డున గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

గనుల వేలంపై నిరసనల వెల్లువ

- టీబీజీకేఎస్, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం
- సింగరేణిని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపు


మందమర్రిరూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



బెల్లంపల్లిరూరల్: సీపీఎం నాయకుల నిరసన



రెబ్బెన: టీబీజీకేఎస్ నాయకుల నిరసన

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ నిరసన వ్యక్తం చేసింది. బుధవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం కమర్షియల్ మైనింగ్ పేరుతో తెలంగాణలోని బొగ్గుగనులను వేలం వేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి రాక ముందు వేలాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మద్దతిచ్చి సంస్థకు నష్టం చేసిందన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మికవర్గం బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, గొర్ల సంతోశ్, ఉత్తేజ్‌రెడ్డి, భాస్కర్, మల్లయ్య, సిరాజ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయాలి

కాసిపేట: కేంద్రం బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేసి సింగరేణి సంస్థకు నామినేషన్ పద్ధతి ద్వారా ఇవ్వాలని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 8 నుంచి వారం రోజులపాటు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇప్పకాయల లింగయ్య, గొల్ల శ్రీనివాస్, సుభాష్‌చంద్రబోస్, నర్సయ్య, వెంకటేష్, నీలయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మాలగురిజాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గోమాస అశోక్ మాట్లాడుతూ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లూరి దేవదాస్, దుర్గం సజ్జీవన్, గోమాస దేవయ్య, గోమాస రాజేశ్, దాగం శ్రీకాంత్, చల్లూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కాసిపేట: సీపీఎం ఆధ్వర్యంలో మల్కెపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద, సోమగూడం ట్యాంకు బస్తీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు సంకె రాజకుమారి, సిడాం జంగుబాయి, లింగయ్య, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, పోశం, భాగ్య, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలన్నారు. దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

మందమర్రిరూరల్: బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా నాయకులతో పాటు పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.


రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం విరమించుకుని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ గోలేటి టౌన్‌షిప్‌లో బుధవారం టీబీజీకేఎస్ నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కమర్షియల్ మైనింగ్ పేరిట కేంద్ర ప్రభుత్వం దేశంలోని బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేసేందుకు వేలం వేస్తోందన్నారు. బొగ్గు బ్లాకులను వేలం వేస్తే సింగరేణి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని, సంస్థను కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు దారావత్ మంగీలాల్, ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సమ్మయ్య, నాయకులు సుగ్రీవులు, దేవేందర్, వెంకటేష్, మారుతి, ఖలీముల్లాఖాన్, సత్యనారాయణ, బాబురావు, కైత స్వామి, తదితరులు పాల్గొన్నారు.


పాతమంచిర్యాల: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


కాసిపేట: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


శ్రీరాంపూర్: ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వాటర్ ట్యాంక్ ఎక్కి రైతు నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన శ్రీరాములు

భీమారం: పోలంపల్లి శివారులోని సర్వేనంబర్ 384లో 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి అటవీశాఖ అధికారులు రానీయడంలేదని కోట శ్రీరాములు అనే రైతు బుధవారం మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకు ఎక్కి దూకేందుకు ప్రయత్నించాడు. విషయం తెలిసిన మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. అనంతరం ఎస్సై రాములు బాధిత రైతును పోలీస్ స్టేషన్‌కు తరలించాడు.

అదనపు కట్నం కేసు నమోదు

మంచిర్యాలక్రైం: దేశ వ్యాప్తంగా ఈనెల 1 నుంచి నూతన చట్టాలు అమలుకాగా మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్లో అదనపు కట్నం కింద బుధవారం తొలికేసు నమోదైంది. గతంలో అదనపు కట్నం కింద నమోదు చేసే కేసుల్లో 498(ఏ) నమోదు చేసేవారు. కొత్త చట్టం అమలైన తర్వాత కొత్త సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజయ్య తెలిపారు. పట్టణంలోని కాలేజ్‌రోడ్‌కు చెందిన నామగాని ఓదెలు–మల్లమ్మ దంపతుల కుమార్తె రమను జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని సాయిచందర్ గౌడ్ ఆరేళ్ల క్రితం పెద్దల ఒప్పందం మేరకు ప్రేమ వివాహం చేసుకున్నాడు. పెళ్లిలో వరకట్నం కింద రూ.6 లక్షల నగదు అందజేశారు. కొంత కాలంగా సాయిచందర్ గౌడ్, అతని బాబాయ్ శంకర్‌గౌడ్ అదనపు కట్నం తేవాలని వేధిస్తుండడంతో రమ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సెక్షన్స్ 85 బీఎన్ఎస్ 3/4 డీపీఏ యాక్ట్ ప్రకారం ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

‘కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి’

శ్రీరాంపూర్: తెలంగాణలో నూతన బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5న సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో పలు గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన సమావేశంలో ఆయూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య మాట్లాడారు. తెలంగాణలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థకు కేటాయించకుండా వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో బొగ్గు బ్లాక్ లను సింగరేణి సంస్థకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చన్న, పిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, మోతె లచ్చన్న, సదానందం, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్కే న్యూటెక్ గనిపై మాట్లాడుతున్న వీరభద్రయ్య

‘కల్యాణలక్ష్మి’ పంపిణీలో నిర్లక్ష్యం

- గడువు ముగిసేరోజే చెక్కు అందజేసిన అధికారులు


సరిత, లబ్ధిదారు


కోటపల్లి: లబ్ధిదారుకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఆ చెక్కు చెల్లకుండా పోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటపల్లి మండలంలోని ఎదులబంధం గ్రామానికి చెందిన జైనేని సరిత కూతురు మేఘనకు 2023లో వివాహంకాగా కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంది. మూడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుండడంతో చెక్కు రాలేదని సమాధానం ఇచ్చేవారు. బుధవారం చెక్కు మంజూరైందని సమాచారం ఇవ్వడంతో సరిత ఆనందంతో కార్యాలయానికి వెళ్లింది. చెక్కు తీసుకుని బ్యాంకులో వేసేందుకు వెళ్లగా గడువు ముగిసిందని అక్కడి అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగింది. ఇలా రెవెన్యూ అధికారుల తీరుతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

గడువు ముగిసిన చెక్కుకో రేటు?

కల్యాణలక్ష్మి చెక్కుల్లో గడువు ముగిసిన చెక్కుకో రేటుతో కోటపల్లి రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. మండలానికి మంజూరైన చెక్కులను ఇటీవల ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పంపిణీ చేయించగా వాటిలో కూడా రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించారని లబ్ధిదారులు వాపోతున్నారు. కావాలని చెక్కులను ఆపివేసి అధికారులు వాటి గడువు ముగియడంతో మళ్లీ ఆర్డీవో అనుమతి కోరాలని లబ్ధిదారులకు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గడువు తీరే వరకు అధికారులు తమ వద్దే ఉంచుకుని ఆ తర్వాత పంపిణీ చేస్తే తమకేం లాభమని వాపోతున్నారు. అధికారులు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ మహేంద్రనాథ్‌ను వివరణ కోరగా చెక్కుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ ఆర్డీవో అనుమతితో వేరే చెక్కు అందజేస్తామన్నారు.


గడువు తీరిన కల్యాణలక్ష్మి చెక్కు

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాబోధన


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

చెన్నూర్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను ఆయా తరగతుల పాఠ్య పుస్తకాల్లోని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రత్యేకాధికారి సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న అనుచరులు!

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ

మంచిర్యాలక్రైం: స్థానిక ఎమ్మెల్యే అండతో అతని అనుచరులు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తూ ఓ గుర్తు తెలియని వ్యక్తి రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. లేఖలో ఎమ్మెల్యే అండతో జగన్ మోహన్‌రావ్ రెచ్చిపోతున్నాడని, భూకబ్జాలకు పాల్పడుతున్నాడని, అతనిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరగబడితే రౌడీ షీటర్లతో దాడులు చేయిస్తున్నాడని, మా భూమిని ఎందుకు కబ్జా చేశావని అడిగితే.. నీకు భూమి లేదు ఇక్కడికి వస్తే తల తెగిపోతుందని బెదిరిస్తున్నాడని, అతని ఆగడాలకు నేను బలై పోతున్నాని, నా చావుతోనైనా మంచిర్యాల పట్టణ ప్రజలకు కనువిప్పు కలగాలని, నాలాంటి బాధితులు చాలామంది ఉన్నారంటూ బాధితుడు రాసిన లేఖ కలకలం రేపుతోంది.

మద్యం వ్యసనం.. కుటుంబం ఛిన్నాభిన్నం

- భర్త తాగుడుకు బానిస కావడంతో తరచూ గొడవలు
- ముగ్గురు కుమార్తెలతో కలిసి పురుగుల మందు తాగిన తల్లి
- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి..


గజ్జిగూడలో ప్రతాప్ ఇల్లు


అనిత మృతదేహం


రమ్య మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ కుటుంబంలో ఆర్థిక, కుటుంబ సమస్యలు ఉండటం సహజమే. అయితే ఆర్థిక సమస్యలతో భర్త తాగుడుకు బానిస కావడం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. భర్త తీరుతో విసుగు చెందిన భార్య కుమార్తెలతో కలిసి పురుగుల మందు తాగింది. చికిత్స పొందుతూ తల్లీకూతురు మృతిచెందగా.. మరో ఇద్దరు కుమార్తెలు మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ విషాదకర ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడలో చోటు చేసుకుంది. గజ్జిగూడలో నివాసం ఉంటున్న ప్రతాప్, అనిత(45) దంపతులకు ఐదుగురు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం జరిపించారు. వ్యవసాయ భూమి ఉన్నా కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. మనోధైర్యం కోల్పోయిన ప్రతాప్ తాగుడుకు బానిసయ్యాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయిన ప్రతాప్ గతంలో ఒకరిపై దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో అతడికి జైలుశిక్ష కూడా పడింది. ఇటీవల బెయిల్‌పై వచ్చి మళ్లీ మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. భర్త తీరుతో విసిగిపోయిన అనిత ముగ్గురు కుమార్తెలు రమ్య(16), లక్ష్మి, ఐశ్వర్యతో కలిసి ఈ నెల 1న పురుగుల మందు తాగింది. మరో కుమార్తె రవళి భయపడి పురుగుల మందు తాగలేదు. గ్రామస్తులు గమనించి కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనిత, రమ్య బుధవారం మృతిచెందారు. లక్ష్మి, ఐశ్వర్య మృత్యువుతో పోరాడుతున్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు. కాగా.. రమ్య ఈ ఏడాది ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించింది. కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా ప్రవేశం లభించలేదు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్


ఆరోగ్య మిత్రలతో మాట్లాడుతున్న కలెక్టర్

బెల్లంపల్లి: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వసతులు, సౌకర్యాలు కల్పించామన్నారు. రోగులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కాంటా చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కూరగాయలు, మటన్ మార్కెట్‌ను సందర్శించారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు.

ఆయన చెబితే చాలు..!

- పాఠశాల నచ్చకుంటే ఖాళీ ఉంటే వెళ్లొచ్చు
- ఎస్ఏగా పదోన్నతి పొంది దగ్గరి మండలానికి వచ్చి..
- ఎంఈవో సతీమణి కావడమే అర్హతా?
- టీచర్ల బదిలీల్లో వింతపోకడలు
- ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు

మంచిర్యాలఅర్బన్: విద్యాబుద్ధులు నేర్పించే టీచర్లు దొడ్డిదారులు వెతుకుతున్నారు. పాఠశాల దూరమైతే దగ్గరకు రావడానికి ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉంటే చాలు. ఇష్టం వచ్చిన పాఠశాలకు బదిలీ చేస్తూ ఓ అధికారి ఆదేశించిన సంఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో చెన్నూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ టీచర్ సౌజన్య కౌన్సెలింగ్‌కు యధావిధిగా హాజరయ్యారు. ఆమెకు కలమడుగు జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి లభించింది. చెన్నూర్ నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉండటమో? ఏమోగానీ నచ్చలేదని ఆమె(ఆ టీచర్) పై అధికారులకు రిక్వెస్ట్ చేశారు. ఓ మండల విద్యాధికారి సతీమణి కావడంతో దగ్గరి మండలంలో ఖాళీగా ఉన్న హైస్కూల్ పోస్టింగ్ కోసం రిక్వెస్ట్ చేయగా ఉన్నతాధికారులు హడావుడిగా అనుకున్న చోటుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్సీ ఏడీ లింగయ్య ఆదేశాల మేరకు ఇచ్చినట్లుగా డీఈవో యాదయ్య ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, MANCHERIAL

డీఈవో ఉత్తర్వుల కాపీ

సదరు టీచరు కలమడుగు నుంచి వేమనపల్లి జెడ్పీఎస్ఎస్‌లో రిపోర్టు చేసినట్లుగా తెలుస్తోంది. సాధారణ ఉపాధ్యాయులకు నిబంధనలు విధించే పై అధికారులు ఇదంతా ‘మామూలు’గా తీసుకున్నారని తెలిసింది. ఈవిషయమై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు తప్పుబడుతున్నారు. బదిలీ అయిన టీచర్లు రిలీవ్ చేయటానికి నిబంధనలు సాకుతూ పాత పాఠశాలలకు పరిమితం చేసే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇదే విషయంపై గురువారం డైరెక్టు ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. తప్పుడు బదిలీ రద్దు చేయకుంటే ఆందోళన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు దూరమైన టీచర్లందరూ రిక్వెస్ట్ పెడితే అనుకున్న పాఠశాలలకు వెళ్లే అవకాశం కల్పిస్తారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పై మండల విద్యాధికారి కూడా రచ్చ చేయకుండా ఉపాధ్యాయ సంఘాల నేతలను ప్రసన్నం చేసుకునేందుకు నానాతంటాలు పడతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై డీఈవో యాదయ్యను సంప్రదించగా డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం ఆమెకు పోస్టింగ్ ఇచ్చానని చెప్పుకొచ్చారు.

కైరిగూడ ఓసీపీ సందర్శన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని బుధవారం బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కె.రఘుకుమార్ సందర్శించారు. ఓసీపీలో నిర్మిస్తున్న ఇన్‌ఫిట్ క్రష్షర్‌ను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ఓసీపీలో చేపడుతున్న రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ప్రతీ ఉద్యోగి, అధికారి రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. మొదటిసారిగా ఓసీపీ సందర్శనకు వచ్చిన జీఎం(సేఫ్టీ)ను ఓసీపీ అధికారులు శాలువాతో సన్మానించి మొక్క అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఇంజనీరు రాజన్న, మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, సేఫ్టీ అధి కారి మధుసూదన్, డీవైపీఎం వేణు, సర్వే అధికారులు దావూద్ అహ్మద్, ఏ.రవి పాల్గొన్నారు.


సేఫ్టీ జీఎంను సన్మానిస్తున్న అధికారులు